ప్రజాశక్తి

శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 5 విజయనగరం



సిటియులో మిగులు సీట్ల భర్తీకి ఓపెన్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 20న ఓపెన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సిటియు విసి కట్టమని తెలిపారు. బిఎస్‌సి కెమిస్ట్రీ, బోటనీ, జియాలజి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్, బిబిఎ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజెమెంట్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను తొలి కౌన్సిలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేశామని తెలిపారు. ఇంకా కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నందున ఓపెన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్‌టిఎ నిర్వహించిన సియుఇఇటి(యుజి) పరీక్ష రాసిన వారు, లేదా ఇంటర్మీడియట్ పాసు అయిన వారు www.ctuap.ac.inలో ఇచ్చిన లింకు ద్వారా తమ పేరును ఈనెల 19లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌ను లేదా ఫోన్ నెంబర్ 0892296033ను సంప్రదించాలని తెలిపారు.




పోరాట యోధుడు ఏచూరి

- ఉమ్మడి జిల్లాలో 2009 ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న సీతారాం ఏచూరి
- ఎందరో నాయకులకు మార్గదర్శి
- పలువురి సంతాపం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి/ టౌన్

కమ్యూనిస్టు ఉద్యమనేత, సిపిఎం అగ్రనాయకుడు, ప్రజా పోరాట యోధుడు సీతారాం ఏచూరి మరణంతో సిపిఎం శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయాయి. గతనెల 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో అనారోగ్యంతో చికిత్సపొందుతున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం మధ్యాహ్నం మృతి చెందిన విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, వామపక్ష నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని, పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకొని ఆయన సిద్ధాంత స్ఫూర్తితో, ఆయన చూపిన ఉద్యమ బాటలో నడుస్తామని ప్రతిన బూనారు. ఆయన జిల్లాకు వచ్చిన సందర్భాన్ని గర్తు చేసుకున్నారు. ఆయన మృతి ముఖ్యంగా సిపిఎంకు, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు.

సీతారాం ఏచూరి 2009 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 13న నాగూరులో నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేశారు. మహాకూటమి తరపున చేపట్టిన ఈ ప్రచార సభలకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కూడా విచ్చేశారు. నాగూరు నియోజకవర్గంలో సిపిఎం తరపు పోటీ చేసిన అభ్యర్థిని గెలిపించేందుకు అక్కడ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఏచూరి ప్రసంగించారు. అదే రోజు సాలూరు, వియనగరంలో జరిగిన బహిరంగ సభల్లోనూ సీతారాం ఏచూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంతేకాకుండా జిల్లాలో విద్యార్థి ఉద్యమాల్లోనూ, సిపిఎం, పలు ప్రజాసంఘాల్లో నాయకులుగా ఉన్న చాలా మంది సీతారాం ఏచూరిని రాజకీయ శిక్షణ తరగతులు, పార్టీ మహాసభలు తదితర సందర్భాల్లో కలుసుకున్నారు. ఆయన నుంచి ఎంతో స్ఫూర్తిని పొందారు.



2009లో నాగూరులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న సీతారాం ఏచూరి, చంద్రబాబు



విజయనగరంలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి (ఫైల్)

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

- ప్రజా పోరాట యోధుడ్ని కోల్పోయాం
- సంతాప సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కమ్యూనిస్టు ఉద్యమ నేత, ప్రజా పోరాట యోధుడు, సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి, దేశంలోని ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అన్నారు. సమసమాజ స్థాపన కోసం చేపట్టే ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం కావడం, పార్టీని బలోపేతం చేయడమే ఆయనకు ఘన నివాళని అన్నారు. సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా గురువారం సాయంత్రం సిపిఎం ఆధ్వర్యాన ఎల్‌బిజి భవనంలో సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ ఊపిరి తిత్తుల వ్యాధితో బాధ పడుతున్న ఏచూరి డిల్లీలో ఎయిమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం బాధాకరమని అన్నారు. ఆయన విద్యార్థి ఉద్యమం నుంచి నేడు మరణించిన వరకు బడుగు బలహీన వర్గాల కోసం సిపిఎం నాయకులుగా చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఆయన పోరాటాలు, ఉద్యమాలు అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఉన్నత కులంలో జన్మించి పేదలు కోసం దళితులు కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. నేడు దేశంలో మతోన్మాదం, కార్పొరేటీకరణ తదితర సవాళ్లను ఎదుర్కోవడంలోను, పేదలు పక్షాన గొంతు వినిపించడంలోను ఏచూరి అగ్రభాగాన ఉంటారని అన్నారు. నేడు దేశంలో మోడీ పాలనలో రాజ్యాంగ రక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలను, ప్రజలను ఐక్యం చేయడంలో ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తి అన్నారు. శ్రామిక వర్గ రాజ్యం కోసం, పీడిత ప్రజల అధికారం కోసం కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం మనం పని చేసినపుడే ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లిన వారం అవుతమని అన్నారు. ఆయన ఆశయాలు కోసం పని చేయడమే నిజమైన నివాళి అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు సీతారాం ఏచూరి పోరాడారన్నారు. కాశ్మీర్‌లో 370 యాక్ట్ చట్టం రద్దును వ్యతిరేకించిన వ్యక్తి అన్నారు. అణు ఒప్పందానికి వ్యతిరేకంగా గొంతు ఎత్తారన్నారు. రాజ్యాంగాన్ని రక్షించు కునేందుకు కృషి చేశారని, ఇందుకోసం అన్ని వర్గాలను కలుపుకొని వచ్చారని తెలిపారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడమే ఆయనకు ఇచ్చిన నివాళని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, ఎ.జగన్మోహన్, పి.రమణమ్మ, కె.సురేష్, పి.రామోహన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఏచూరి మృతికి సిపిఎం నెల్లిమర్ల మండల నాయకులు కిల్లంపల్లి రామారావు సంతాపం తెలిపారు.



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ఏచూరి మతి తీరని లోటు

బొబ్బిలి : సీతారాం ఏచూరి మృతి సిపిఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఏచూరికి నివాళులర్పించారు. పేదలు, కార్మికులు, రైతులు, కష్ట జీవులు పక్షాన నిరంతరం పోరాటం చేశారన్నారు. ఏచూరి మరణం బాధ కలిగించిందన్నారు. ఏచూరి ఆశయ సాధనకు పోరాటాలు చేస్తామని చెప్పారు.

వామపక్షాలకు తీరని లోటు : సిపిఐ

విజయనగరం కోట : సిపిఎం అగ్రనేత సీతారాం ఏచూరి మరణం వామపక్ష పార్టీలకు తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పేర్కొన్నారు. ఓ ఎర్రమందారం నేల రాలిందని అన్నారు. సిపిఎం పార్టీకి సమర్థవంతమైన నాయకుడిగా, గొప్ప పార్లమెంటీరియన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఆయన ఊపిరి పోశారని అన్నారు. ఆయన మృతికి నివాళులర్పిస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మంచి నాయకుడిని దేశం కోల్పోయింది : వైసిపి

వామపక్ష యోధుడు,సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు, లౌకిక వాదానికి తీరని లోటని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఓ మంచి నాయకుడిని దేశం కోల్పోయిందని తెలిపారు. ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఏచూరి .కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగు పెట్టిన సీతారాం ఏచూరి నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. కార్మిక లోకానికి, లౌకిక వాదానికి ఏచూరి మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

సీతారాం ఏచూరి లేని లోటు తీవ్రమైనది

మతోన్మాద శక్తులతో తీవ్రమైన సైద్ధాంతిక సంఘర్షణ పడుతున్న నేపథ్యంలో సీతారాం ఏచూరి మరణించడం దేశంలో మతోన్మాద వ్యతిరేక శక్తులకు తీవ్రమైన లోటు. ఏచూరితో పార్టీ సెక్రటేరియట్‌లో కలిసి మాట్లాడడం జరిగేది. ఆయన ఎదుటి వారు చెప్పిన మాటలో శ్రద్ధగా విని లోతుగా అవగాహన చేసుకొని సూటిగా స్పష్టంగా సమధానం చెప్పగలిగే సమర్థులు. ఏవిషయం చెప్పినా మృదువుగా ఇతరులను బాధపెట్టకుండా ఒప్పించే విధంగా మాట్లాడే స్వభావం. భావోద్వేషాలకు గురికాకుండా సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా ఐక్యతను కాపాడే ధోరణి సీతారాం ఏచూరిది. నిత్యం నవ్వుతూ ఇతరులను ఆకర్షించే విధంగా ఉంటుంది. ఆయన ధోరణి. నేటి జాతీయ, అంతర్జాతీయ సంక్లిష్ట పరిస్థితుల్లో సీతారాం ఏచూరి లేని లోటు తీవ్రమైనది. వారి కుటుంబానికి మరింతం కష్టమైనది. ఆయన మృతికి నివాళులర్పిస్తున్నాం.

ఎం.కృష్ణమూర్తి, సిపిఎం సీనియర్ నాయకులు

ప్రజా ఉద్యమాల నిర్వహణలో నాకు స్ఫూర్తి

1991లో కటక్ లో జరిగిన అఖిల భారత శాంతి సభలో ఆయనతో పాటు నాలుగు రోజులు గడపడంతో ఆయనతో తొలిసారి పరిచయం ఏర్పడింది. నాలుగు రోజులు పాటు ఆ సభలో ఆయనతో పాల్గొన్నాను. నాకు ప్రజా ఉద్యమంలో ప్రారంభంలో ఆయన స్ఫూర్తిగా నిలిచారు. ఆంధ్రప్రతినిధుల టీమ్ లీడర్‌గా ఏచూరి ఉన్నారు. మాకు సిద్ధాంత అవగాహన కల్పించడంలోను, వివరించడంలోను ముందున్నారు. చాలా విషయాలు తెలుసుకునే అవకాశం వచ్చింది. ఆయన సిద్ధాంత బోధన నాకు స్ఫూర్తిగా నిలిచింది. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. అవగాహన సిద్ధాంతం, చైతన్యం , ఆచరణ విధానం నాకు ప్రజా ఉద్యమంలో స్ఫూర్తి నిచ్చింది.

తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

మాకు స్ఫూర్తి నింపిన నేత

కామ్రేడ్ సీతారాం ఏచూరితో నేను ఐటిఐ చదువుతుండగా ఏలూరులో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలలో తొలిసారిగా పరిచయం ఏర్పడింది. 1991లో రష్యాలో సోషలిజం కూలిపోయినప్పుడు మాలో ఆత్మ విశ్వాసం నింపేందుకు విశాఖ ఎవిఎన్ కళాశాల హాల్‌లో సభకు వచ్చారు. 1992లో బాబ్రీ మసీదును కూల్చిన సందర్భంగా మతోన్మాద ప్రమాదాన్ని తెలియజేస్తూ హైదారాబాద్ సభలోనూ, 1993లో డి వై ఎఫ్ ఐ అఖిల భారత మహాసభ కోల్‌కత్తాలో అయన ప్రసంగం మాలో నూతన ఉత్తేజాన్ని నింపింది. 1994లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర శిక్షణా తరగతులకు కాకినాడ, 2022లో సిపిఎం రాష్ట్ర మహాసభలు తాడేపల్లి వరకు ఆయనతో నా అనుబంధం మరువలేనిది. ప్రత్యేకంగా ఆయన 2009లో ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగూరులో జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు అప్పుడు నేను నాగూరు ఎన్నికల ఇన్‌ఛార్జిగా ఉన్నాను.

రెడ్డి శంకరరావు , సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

ఏచూరి నిరాడంబర జీవితం నాకు ఆదర్శం

విద్యార్థి ఉద్యమాల్లో సీతారాం ఏచూరి మాకు ఆదర్శం. సీతారాం ఏచూరిని 2022లో ఢిల్లీలోని హరికిషన్‌సింగ్ సూర్జిత్ భవనంలో ఎస్ ఎఫ్ఐ అఖిల భారత శిక్షణా తరగతుల్లో ప్రత్యక్షంగా కలిశాను. పరిచయం చేసుకున్నాను. మత తత్వం అనే క్లాస్‌ను బోధించారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అయినా సాధారణమైన కార్యకర్తగా అంటూ విద్యార్థులకు వచ్చిన సందేహాలను నివృత్తి చేస్తూ స్ఫూర్తినిచ్చారు. మాతో పాటు భోజనాలు సమయంలో క్యూలో నిల్చొని ఆయన నిరాడంబరతను చూపించారు. ఆచరణలో కమ్యూనిస్టుగా ఆదర్శాలను పాటిస్తూ మా లాంటి యువకులకు మార్గనిర్దేశం చేశారు. ఆయనతో మాట్లాడే అవకాశం నాకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను.

పి.రామ్మోహన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు

మార్గదర్శకులు ఏచూరి

మొదటి సారి గా 2009 లో జరిగిన ఎన్నికలు సందర్భంగా నాగూరు నియోజకవర్గం లో సిపిఎం పార్టీ అభ్యర్థి తరుపున ప్రచారంలో భాగంగా జరిగిన బహిరంగ సభలో సీతారాం ఏచూరి పాల్గొన్నారు. ఆ సభ సందర్భంగా ఆయనను కలిశాను. తరువాత రాష్ట్ర విభజన అనంతరం జరిగిన విజయవాడ, భీమవరం, తాడేపల్లిలో జరిగిన పార్టీ మహాసభల్లో ఆయనను కలిశాను. ఆ సమయంలో ఏచూరి గారితో కొద్ది సేపు మాట్లాడాను. మీరు ఏ జిల్లా నుంచి హాజరయ్యారు? ఏ రంగంలో పని చేస్తున్నారు అని రెండు,, మూడు నిమిషాల పాటు మాట్లాడాను. పార్టీ శ్రేణులకు ఆయన ఓ మార్గదర్శి.

టివి రమణ, సిఐటియు నాయకులు

ఎకరాకు రూ.25వేలు చెల్లించాలి

- 17,18తేదీల్లో గ్రామ సచివాలయాలకు వినతులు
- 23,24తేదీల్లో మండలాల వద్ద, 26న కలెక్టరేట్ వద్ద ధర్నాలు
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలో దెబ్బతిన్న వరి పంటకు ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో పోరాటం చేయనున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 17,18 తేదీల్లో సచివాలయాల వద్ద, 23,24తేదీల్లో మండల కేంద్రాల్లోను, 26న కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షానికి ప్రభుత్వం ప్రకటించిన 5,67000 ఎకరాలు కంటే మూడు రెట్లు ఎకరాలకు పంట నష్టం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు నష్టపరిహారం సరికాదన్నారు. వరి పంటకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు- సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నారు. కౌలురైతు గుర్తింపు కార్డుల పంపిణిలో వాస్తవ సాగుదారులకు కాకుండా బినామీలు, అనర్హులకు కౌలు గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. ఈ మోసాన్ని అరికట్టాలన్నారు. మోటర్లకు మీటర్లు పెట్టడం అదాని కంపెనీకి తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు కనుక జీవో 22ను రద్దు చేయాలన్నారు. అసంపూర్తిగా వున్న ప్రాజెక్టులు, కాలువలు తారకరామ, గుర్ల గెడ్డ, తోటపల్లి, గజపతినగరం బ్రాంచీ కాలువ నిధులు ఇచ్చి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తోటపల్లి, మడ్డువలస, వెంగళరాయ, తాటిపూడి, ఆంధ్రకాలువలు సిమ్మెంట్ లైనింగ్ చేసి చివరి ఆయకట్టువరకు నీరు అందించాలన్నారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కౌలు రైతుల సంఘం నాయకులు రాకోటి రాములు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ విద్యుత్తు : జెసి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లు రాయితీ పై అందిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ఈ పథకం వలన గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని, ఇంటి కప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు లేదా 100 చదరపు అడుగుల స్థలంలో 1 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజలంతా దీనిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూర్య ఘర్ యోజన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఈ యూనిట్ల ను ఏర్పాటు చేసుకోడానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, తక్కువ వడ్డీ తో బ్యాంకు రుణాలు కూడా అందిస్తామని తెలిపారు. సోలార్ రూఫ్ ఏర్పాటు కోసం, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. www.pmsuryaghar.gov.in/apepdcl webite ద్వారా లేదా పిఎం సూర్య ఘర్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మంత్రి ఎస్కార్ట్ వాహనానికి ప్రమాదం

- వ్యాన్‌ను ఢీ కొట్టిన జీపు : 8 మందికి గాయాలు
- డ్రైవర్ చాకచక్యంతో మంత్రికి తప్పిన ముప్ప

ప్రజాశక్తి - రామభద్రపురం

విజయనగరం జిల్లా రామభద్రపురం మండల పరిధిలో ఆరికతోట పెట్రోల్ బంకు సమీపాన జాతీయ రహదారిపై గురువారం ఉదయం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ఎస్కార్ట్ వాహనం, వ్యానును ఢీకొన్న ప్రమాదంలో 8 మందికి గాయాలయ్యాయి. డ్రైవర్ చాకచక్యంతో మంత్రి సంధ్యారాణి ప్రమాదం నుంచి బయట పడ్డారు. సాలూరు నుంచి మెంటాడ అధికార కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతుండగా ఆరికతోట వైపు నుంచి ఎదురుగా వస్తున్న వ్యానును మంత్రి కారు ముందు వెళుతున్న ఎస్కార్ట్ వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఎస్కార్ట్ వాహనంలో ఉన్న ఎఆర్ ఎస్ఐ రమణ, హెచ్‌సి సునీల్, కానిస్టేబుళ్లు గణపతి, మహేష్, ఎస్కార్ట్ వాహన డ్రైవర్ ఎబివిఎస్ఎన్ రాజులకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 ద్వారా విజయనగరం తిరుమల మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ బుగత త్రినాథరావు, బోను గౌరమ్మ, కడుగండి సీతమ్మలకు కూడా గాయాలయ్యాయి. వీరిలో డ్రైవర్ త్రినాథరావును బాడంగి సిహెచ్‌సికి తరలించారు. మిగతా ఇద్దరిని ఆరికతోట పిహెచ్‌సికి ప్రాథమిక వైద్యం కోసం తరలించారు. ఎస్కార్ట్ వాహనంలో గాయపడిన సిబ్బందిని ఆస్పత్రిలో జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఎస్కార్ట్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వెలమల ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఇంజిఇన్ భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. సంఘటనా స్థలాన్ని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న వాహనాలను పక్కకు తరలించి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.



వ్యాన్‌ను ఢీకొన్న ఎస్కార్టు వాహనం



సిబ్బందిని పరామర్శిస్తున్న ఎస్‌పి

ఎయిడ్స్‌పై అవగాహనకు 5కె రన్

విజయనగరం కోట : హెచ్ఐవి, ఎయిడ్స్‌పై యువతకు అవగాహన కల్పించేందుకు గురువారం వైద్యఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యాన జిల్లా స్థాయి 5కె మారథాన్ నిర్వహించారు. గతనెల 29న విజ్జీస్టేడియంలో నిర్వహించిన పరుగు పందెలో గెలుపొందిన వీరికి ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పురుషులలో కొత్తవలసలోని ప్రగతి కాలేజికి చెందిన పి. సాయి బహుమతి రూ7వేలు, అబ్దుల్ కలాం కళాశాల విద్యార్థి కె.రాము ద్వితీయ బహుమతి రూ.4వేలు సాధించారు. బాలికల్లో మొదటి బహుమతి పి.వసంత, ద్వితీయ బహుమతి వి.భార్గవి సాధించారు. వీరికి డిఎంహెచ్ఒ కార్యాలయంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరావు, డిఎల్‌డిం కె.కారణి ఆధ్వర్యాన నగదు బహుమతి అందజేశారు.

పంట నష్టాలపై సమగ్ర పరిశీలన చేయాలి

రైతులను, జిల్లా ప్రజలను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటలను, రోడ్లు కాలువలు, కల్వర్టులను సమగ్ర పరిశీలన చేసి నష్టాన్ని అంచనా వేసి జిల్లా ప్రజలను, రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వర్షాలకు బొబ్బిలి మండలం పారాది వద్ద కట్టిన కాజ్‌వే, పూసపాటిరేగ మండలంలో కల్వర్టు కొట్టుకుపోయాయని తెలిపారు. విజయనగరం రోడ్లు గోతులు పడి అధ్వాన్నంగా తయార య్యాయని, దత్తిరాజేరు మండలం గడసాంలో కల్వర్టుకు గండిపడిందని తెలిపారు. వాణిజ్య పంటలు, ఉద్యాన పంటలతో పాటు వరికి చాలా నష్టం జరిగిందని అన్నారు. ఇంత నష్టం జరిగితే ఏమీ నష్టం లేదని చెప్పడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్ సమగ్రంగా సూక్ష్మ స్థాయిలో విచారణ జరిపి రైతులను, ప్రజలను ఆదుకోవాల న్నారు.నాసిరకం రాష్ట్రంలో జరిగిన విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛతా సేవా : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర బిఆర్ అంబేద్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా మహాత్మా గాంధీ జయంతిని పురష్కరించుకొని ఈ నెల 17 నుండి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాలు జరుగుతాయని, అక్టోబర్ 2 న స్వచ్ఛ భారత్ దివాస్ గా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో 3 రకాలు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 17 న ప్రారంభోత్సవం, 18 నుండి అక్టోబర్ 1 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారపు. స్వచ్ఛతాకి భగీదరి లో భాగంగా తల్లి పేరుతో ఒక మొక్కను నాటడం , మెప్మా, డ్వాక్రా , స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యం లో స్థానిక స్వచ్ఛతా కార్యక్రమాల పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ నిరోధం , తాగు నీటిని క్లోరినేషణ్ చేయడం, ఆరోగ్యకరమైన జీవితం , తదితర అంశాలపై అవగాహన కలిగిస్తామన్నారు. పార్కులలో గ్రామలో సేల్ఫీ పాయింట్ లను ఏర్పాటు చేయడం, సాలిడ్ వేస్ట్ భవనాలకు పెయింటింగ్ చేయడం , అన్ని విద్యా సంస్థలలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించడం, ర్యాలీలు, మానవ హారం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సంపూర్ణ స్వచ్ఛతా - స్వచ్ఛతా లక్షిత్ కార్యక్రమంలో భాగంగా నీటి నిల్వలు ఉన్న చోట్లను గుర్తించి బ్లీచింగ్ చల్లడం, ఘన వ్యర్థాలను తరలించడంతదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బాలల సురక్షా కార్యక్రమాలు, వాక్సినేషన్ డ్రైవ్, పోషకాహార పంపిణీ, హెల్త్ ఇన్సురెన్సు నమోదుకు సహకారం, స్కిల్ డెవలప్మెంట్ వర్క్‌షాప్స్ , ఆఖరున సన్మాన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అక్టోబర్ 2 వ తేదీన స్వచ్ఛ భారత్ దివాస్ ఉత్సవం తో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. సమావేశంల పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూరుకుపోయిన లారీలు

బొబ్బిలి: బొబ్బిలి-తెర్లాం రోడ్డులో పిరిడి జంక్షన్ వద్ద గోతులలో రెండు లారీలు గురువారం కూరుకుపోయాయి. దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. గోతులు నుంచి లారీలను బయటకు తీయడంతో వాహనాలు రాకపోకలు జరిగాయి. రోడ్డు పూర్తిగా పాడైపోయినా ప్రభుత్వం బాగు చేసేందుకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్కూల్ గేమ్స్ నిర్వాహణపై సమావేశం

శృంగవరపుకోట: మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహణపై ఎంఇఒ- 2 పాదం గణపతి లక్ష్మి మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో పట్టణంలోని విద్యా వనరుల కేంద్రంలో గురువారం సమావేశమయ్యారు. త్వరలో నిర్వహించబోయే మండల స్థాయి స్కూల్ గేమ్స్‌కు వ్యాయామ ఉపాధ్యాయులందరూ సంసిద్ధంగా ఉండాలని ఆదేశిస్తూ వారికి సూచనలు సలహాలను అందించారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు జి లక్ష్మణరావు, ఎస్ కోట మండల క్రీడా కోఆర్డినేటర్, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, 17మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుకు చలానా తీయాల్సిందే

శృంగవరపుకోట: ఎస్‌కోట మేజరు పంచాయతీ పరిధిలో రహదారుల పక్కన ఏర్పాటు చేసే ఎటువంటి ఫ్లెక్సీలకైనా పంచాయతీరాజ్ శాఖకు తగిన చలానా రుసుం చెల్లించాల్సిందేనని సర్పంచ్ గనివాడ సంతోషికుమారి స్పష్టం చేశారు. ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో ఇఒ, వార్డు సభ్యులతో కలిసి గురువారం నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలోనే పంచాయతీలో చేసిన తీర్మానం మేరకు ఫ్లెక్సీల కొలతలు, ప్రదర్శించే రోజులను బట్టీ చలానా తీయాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ నిబంధనను పంచాయతీ పరిధిలోని ప్రజలు, అన్నీ పార్టీల నాయకులు ఖచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ నిబంధన అమల్లోకి తెచ్చామని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న పలువురు చలానా తీసి పంచాయతీకి సమర్పించారని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యనిర్వాహణ అధికారి అనురాధ, వార్డు సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన్-బిని తక్షణమే రద్దు చేయాలి

రామభద్రపురం: మండలంలోని తారాపురంలో చింతాలమ్మ తల్లి దేవాదాయ భూమికి సంబంధించి తప్పుడు ధృవ పత్రాలు ద్వారా పొందిన 1బిని తక్షణమే రద్దు చేయాలని, భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఇటీవల ఈ భూములపై తహశీల్దార్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఆ భూముల్లో తహశీల్దార్ సులోచనారాణి గురువారం పరిశీలించారు. సుమారు 58 సెంట్ల భూమిని ఎన్నో ఏళ్ల కిందట చింతాలమ్మతల్లికి కొంతమంది దానమిచ్చారని, అయితే ఆ భూమిని ఆక్రమణ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఇటువంటి ప్రయత్నాలను తిప్పికొట్టాలని గ్రామస్తులు పిల్లా శ్రీనివాసరావు, పొట్టంగి తమ్మినాయుడు బెవర చినమ్మతల్లి, దుంప భాస్కరరావులు తహశీల్దార్‌ను కోరారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటానని తెలిపారు.

మోతాదుకు మించి పురుగు మందులొద్దు

డెంకాడ: మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వరి పంటకు వాడకూడదని ఎఒ నిర్మల తెలిపారు. మండలంలోని సింగవరం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ పొందడానికి ప్రామాణికమైన నిర్దిష్ట రసాయన పురుగు మందులు, ఎరువులు మాత్రమే వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిఇఒ ఏ ప్రభాకర్, ఎఫ్‌పిఒ శ్రీ రామాంజనేయ, సర్పంచ్ పిట్ట అప్పారావు, ఎఇఒ రామకోటి, రైతులు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ సర్వేను అడ్డుకుంటాం

వేపాడ: పోలవరం ఎడమ కాలువ సర్వేను అడ్డుకుంటామని పోరాట కమిటీ జిల్లా నాయకులు ఏడువాక రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని దబ్బిరాజుపేట సర్వేకు వచ్చిన అధికారులను సర్వే చేయొద్దని, డిజైన్ మార్చడం ఒక్కటే మార్గమని నాయకులు గురువారం అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏడువాక అప్పలనాయుడు, సేనాపతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

రేగిడి: మండలంలోని బూరాడ జంక్షన్ వద్ద గంజాయి, డ్రగ్స్‌పై వాహనాలను గురువారం ఎస్‌ఐ పి. లీలావతి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలు ఇతర వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ రవాణాపై నిఘా ఉంచామన్నారు. వాహనాల్లో లౌడ్ స్పీకర్లు వాడితే కేసులు బుక్ చేస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

మెరైన్ పోలీసు స్టేషన్ సందర్శన

భోగాపురం: కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ నార్త్ డివిజన్ డిఎస్‌పి ఎన్ కాళిదాసు పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి మెరైన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులన్నీ తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడి పోలీస్ స్టేషన్ పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జనాలు సందర్భంగా సముద్రానికి వచ్చే భక్తులు నీటిలో స్నానాలకు దిగి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నెలిగడ్డ పేట సముద్ర తీర ప్రాంతానికి వెళ్లి అక్కడ మత్స్యకారులతో మాట్లాడారు. తుపాను సమయంలో వారు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మెరైన్ పోలీస్ స్టేషన్ సిఐ కె.వైకుంఠరావు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

కొండలక్ష్మీపురంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

గరివిడి: మండలంలోని కొండ లక్ష్మీపురం గ్రామంలో మానవీయతా సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బందితో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటికి సంబంధించిన సమస్యలతో 76 మంది హాజరు కాగా, వారిలో కంటి ఆపరేషన్ కోసం 36 మందిని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది, మానవీయత అధ్యక్షులు గోవిందరాజులు, గ్రామ సర్పంచ్ పాండ్రంకి కామేశ్వరరావు, బి. కామేశ్వరరావు, ఉప సర్పంచ్ లక్ష్మీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు,తాగునీటి సమస్యను పరిష్కరించండి

బొబ్బిలి: రోడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మప్పకు బిడి వార్డు కౌన్సిలర్ వి.హైమావతి కోరారు. స్థానిక బిడి వార్డులో గురువారం కమిషనర్ వార్డు పర్యటన చేశారు. వార్డులో రోడ్లు పాడైపోవడం, తాగునీరు సంపూర్ణంగా ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రోడ్లు బాగు చేయాలని ఆమెను కోరారు. వార్డులో గుర్తించిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చంద్రబాబు, రవీంద్ర చిత్ర పటాలకు పాలాభిషేకం

బొబ్బిలి: ఎస్ఇబిను ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లి రవీంద్ర చిత్ర పటాలకు ఎక్సైజ్ సిబ్బంది పాలాభిషేకం చేశారు. ఎక్సైజ్ శాఖ సిఐ బివి మురళీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఇబిను ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడం ఉద్యోగులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

సువర్ణముఖిలో సిల్ట్ తొలగింపునకు చర్యలు

జెసి సేతు మాధవన్ వెల్లడి

ప్రజాశక్తి - వంగర

మడ్డువలస ప్రాజెక్టు ఎగువ భాగంలో సువర్ణముఖి నదిని ఆనుకొని ఉన్న కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల రక్షణ కోసం నదిలో సిల్ట్ తొలగింపునకు చర్యలు చేపడతామని జెసి ఎస్.సేతుమాధవన్ తెలిపారు. మండలంలోని కొండచాకరాపల్లి గ్రామం వద్ద సువర్ణముఖి నదిలో సిల్ట్ పేరుకుపోయిన ప్రాంతాన్ని చీపురుపల్లి ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, మైనింగ్ డిడి సూర్యచంద్రరావుతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. నదిలో పేరుకుపోయిన బురద మట్టిని తొలగించి సేకరించిన ఇసుకను తరలించడం, స్టాక్ పాయింట్ స్థల పరిశీలన వంటి అంశాలను అధికారులతో మాట్లాడి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువర్ణముఖి నదిలో వరద ఎక్కువగా ఉన్న సమయాల్లో వరద నీరు గ్రామాల్లోకి



గ్రామస్తులతో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

చొరబడుతుండటంతో ఆ సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు పంటలకు నష్టం జరుగుతుందన్నారు. కొండచాకరాపల్లి, కొప్పర గ్రామాల రక్షణ నిమిత్తం కొండచాకరాపల్లి గ్రామం వద్ద నదిని ఆనుకొని ఉన్న మట్టి బురదను తొలగిస్తామని అందులో ఇసుకను వేరుచేసి గ్రామ సమీపంలోని ఎస్‌టి (టిడిఎ) కాలనీ ఆనుకొని స్టాక్ పాయింట్ కు తరలిస్తామని చెప్పారు. అక్కడ నుంచి బొబ్బిలిలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కి తరలించి జిల్లాలో ప్రజల అవసరాల కోసం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామన్నారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో సమీక్షించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కొండచారపల్లి, కొప్పర ఆనుకుని ఉన్న సువర్ణముఖి నదిలో రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఇప్పటికే రూ.21 కోట్లతో ఏడాది క్రితం నివేదికలు అందజేశామని జెసి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.ధర్మరాజు, ఆర్‌ఐ జామి మురళి, మడ్డువలస ప్రాజెక్టు అధికారులు నితిన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.300 కోట్లు వ్యవసాయ రుణాలే లక్ష్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని సుమారు రూ.300 కోట్లు వ్యవసాయ రుణాలు రైతులకు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని డిసిసిబి సిఇఒ సిహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక డిసిసిబి బ్రాంచ్‌ను ఆయన గురువారం సందర్శించారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.119 కోట్లు రుణాలు అందజేసామన్నారు. పిఎసిఎస్‌లను కంప్యూ టరైజేషన్ చేస్తున్నామని ఇప్పటివరకు సుమారు 70 శాతం అయ్యిందని చెప్పారు. డిసిసిబి పరిధిలోని అన్ని బ్యాంకుల ద్వారా అన్ని రకాల రుణాలూ ఇస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణాలకు రూ.40 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. ఇంటి మరమత్తులకు రూ.ఒక లక్ష వరకు రుణాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు టిడ్కో ఇళ్లకు రూ.18.63 కోట్లు, హౌసింగ్‌కు రూ.4.68 కోట్లు ఇచ్చామన్నారు. డిసిసిబి ద్వారా సుమారు రూ.2165 కోట్లు వరకు లావాదేవీలు జరుగుతున్నాయని డిపాజిట్లు రూ.300 కోట్లు సేకరించామని చెప్పారు. పార్వతీపురం,నెల్లిమర్ల పిఎసిఎస్‌లు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని, పెదపదం, చెముడు పిఎసిఎస్‌ల్లో సిబ్బందికి జీతాలు ఇవ్వలేని విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ మేనేజర్ చంద్ర మోహన్ నాయుడు, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు

సిఎం సహాయ నిధికి విరాళాలు

బొబ్బిలి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు ఇవ్వాలని ప్రజలకు ఎమ్మెల్యే బేబినాయన పిలుపునివ్వడంతో సిఎం సహాయ నిధికి విరాళాలు ఇచ్చేందుకు ప్రజలు, టిడిపి కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. బాడంగి మండలం తెంటువలస సర్పంచ్ తెంటు చిరంజీవి రూ.25వేలు, డొంకినవలస లక్ష్మీనారాయణ రైస్ మిల్లు ఎండి యు.హరి రూ.25వేలు, బొబ్బిలి మండలం దిబ్బగుడివలస గ్రామానికి చెందిన రెడ్డి భూషణ్ రూ.10వేలు, ఎం.నారాయణరావు రూ.10వేలు, పట్టణంలో బార్బర్ షాపు నిర్వహిస్తున్న చిలకలపల్లి శ్రీనివాసరావు, బి.అప్పారావు రూ.5వేలు విరాళంగా ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. దాతలను బేబినాయన అభినందించారు.

బాలాజీ టెక్స్‌టైల్ వర్తకుల విరాళం

విజయనగరం టౌన్ : వరద బాధితులకు నగరంలోని బాలాజీ మార్కెట్ టెక్స్‌టైల్ వర్తకులు తమ వంతు సాయం అందించారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజును కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా స్పందించి లక్ష రూపాయల సహాయాన్ని అందించిన బాలాజీ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో బాలాజీ వస్త్రా మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డెపు వెంకటరావు, పూర్వపు అధ్యక్షుడు శవరమల్ చౌదరి, ప్రతినిధులు నిర్మల్ కుమార్ జైన్, వేలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ప్లాస్టిక్ విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని ప్రజారోగ్య సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సూచించారు. గురువారం 1వ సర్కిల్ పరిధిలో ప్రజారోగ్య సిబ్బంది సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న, విక్రయిస్తున్న వ్యాపారులకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. 10 కేజీల వరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుని, మరల ఇటువంటివి వినియోగించినట్లయితే చట్టపరమైన చర్యలు



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ వార్డు సందర్శన

నగరంలోని 8వ డివిజన్ గురాచారి వీధి నుండి ప్రారంభమైన వార్డు పర్యటనలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గురాచారి వీధి, లక్క పందిరి వీధి, ఆనంద నగర్, మఠం వీధి తదితర ప్రాంతాలలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కొన్నిచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండడాన్ని గమనించారు. చెత్తాచెదారాలను తక్షణమే తొలగించి వేశారు.

నేరాలు ఘోరాలు

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట, వసంత గ్రామాల మధ్య ఉన్న గెడ్డలో ఎస్‌కోట మండలం చందలూరికి చెందిన సతీష్ బుధవారం గల్లంతయిన విషయం తెలిసిందే. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు అతని కోసం గాలించారు. వీరితో ఆపటు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు కూడా గాలించగా గురువారం ఉదయం సతీష్ మృతదేహం లభ్యమైందని తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకులు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని గజరాయనివలస గ్రామానికి చెందిన మార్పిన మనోజ్ (24) గురువారం ఉదయం పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఎరుకల పాకల గ్రామానికి చెందిన గేదెల అజయ్ (17) కూడా పురుగులు మందు తాగాడు. అజయ్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల కి వెళతానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. కొంత సమయం తరువాత తల్లికి ఫోన్ చేసి కళాశాలకు కట్టాలని వెంటనే రూ.300 ఫోన్‌పే చేయాలని కోరాడు. మీ నాన్న వచ్చిన తరువాత ఇస్తానని ఆమె సమాధానం చెప్పడంతో మనస్థాపం చెందిన అజయ్ పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఇద్దరికి స్థానిక సామాజిక ఆసుపత్రిలో ప్రథమ చికత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారని వైద్యులు నాగేశ్వరరావు తెలిపారు.

అంతర్ రాష్ట్ర ముఠా అరెస్ట్ : డిఎస్‌పి

ప్రజాశక్తి- బాడంగి

మత్తు పదార్థాల విక్రయాలు రవాణాపై పోలీస్ శాఖ దృష్టి సారించిన నేపథ్యంలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా సభ్యులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాస్, రూరల్ సిఐ నారాయణ రావు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఠా వివరాలను వెల్లడించారు. గురువారం ఉదయం 10 గంటలకు రైల్వే ఎత్తు బ్రిడ్జి దగ్గర ఎస్ఐ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేయగా అనుమానంతో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్పెండర్ వాహనంతో అనుమానాస్పద స్థితిలో కనిపించారు.వాళ్ళు దగ్గర ఉన్న మూటలను గుర్తించి రెవెన్యూ అధికారులు సమక్షంలో తెరవగా 10 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తుంచారు. ఎస్ఐ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో వారిని కస్టడీలోకి తీసుకుని విచారించగా అందులో గంజాయి ఉన్నట్లు తమకు తెలియదని వేరే వ్యక్తి ఇచ్చి పంపించారని చెప్పారు. మూడో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని డిఎస్‌పి తెలిపారు. వీలు ఒరిస్సా రాష్ట్రం కొరపుట్ జిల్లా జింగరాబాద్ గ్రామానికి చెందిన వాళ్లుగా గుర్తించామన్నారు. ఈ ముఠాను పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు.

గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బొబ్బిలి: స్థానిక గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కె.హర్షవర్ధన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గంట్యాడ మండలం బురదపాడు గ్రామానికి చెందిన హర్షవర్ధన్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వినాయక చవితికి ఇంటికి వెళ్లిన హర్షవర్ధన్ బుధవారం పాఠశాలకు వచ్చాడు. పాఠశాలలోని డార్మెంటరీకి వెళ్లిన హర్షవర్ధన్ గురువారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు వెంటనే చూడడంతో ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బాలుడు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఆసుపత్రికి డిఎస్పీ శ్రీనివాసరావు, పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ వెళ్లి విద్యాశాఖాధికారులు నుంచి వివరాలు సేకరిస్తున్నారు. బాగా చదవడం లేదని ఉపాధ్యాయులు మండలించడం వల్లనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మధుపాడలో దారుణ హత్య

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని మధుపాడ గ్రామంలో బుధవారం రాత్రి దారుణ హత్య జరిగింది. వినాయకుని నిమజ్జనం అనంతరం ఇరువురి వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఈ హత్య జరిగినట్లు తెలిస్తోంది. గ్రామానికి చెందిన నెక్కల చెల్లం నాయుడు, పాటూరి సాయి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో సాయి చెల్లంనాయుడు (30) తలపై రాయితో కట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి విషయాన్ని తెలుసుకున్న సాయి అక్కడ నుంచి పరారయ్యాడని అతని కోసం గాలిస్తున్నామని సిఐ రామకృష్ణ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిబిఎం పాఠశాల స్థలం రిజిస్ట్రేషన్‌పై పోరాటం

బొబ్బిలి: సిబిఎం బాలికోన్నత పాఠశాల స్థలం రిజిస్ట్రేషన్ పై ప్రజా సంఘాలు, వామపక్షాలు ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించే సిబిఎం పాఠశాల స్థలాన్ని అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేయడం దుర్మార్గమన్నారు. ఒక క్రిస్టియన్ ట్రస్ట్‌కు చెందిన ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసే హక్కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. రెవెన్యూ, విద్యాశాఖాధికారులు అండదండలతోనే లంచాలు తీసుకుని సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారని విమర్శించారు. తొమ్మిది నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేసిన సిబిసిఎన్సీ నుంచి కరస్పాండెంట్‌గా ఎన్నికైన రత్నకుమార్ పాఠశాల రెన్యూవల్ కోసం దరఖాస్తుపై సంతకం ఎలా చేశారని ప్రశ్నించారు. ప్రజలు, ప్రజా సంఘాలు, విద్యార్థుల తల్లి దండ్రులను పక్కదారి పట్టించేందుకు రత్నకుమార్ డ్రామాలు ఆడారని విమర్శించారు. సిబిఎం పాఠశాల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని పోరాటం చేస్తామన్నారు.